సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 8 । మార్చి । 2024





## సోమశిలలో 14.66 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారానికి 14.66 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 300 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



## బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | రూ.66,650 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) | రూ.5,985 |
| మూడు శాతం జీఎస్టీతో | రూ.6,165 |
| నవర (8 గ్రాములు) | రూ.49,320 |

## వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.0 /24.7

గురువారం గాలిలో తేమ 50 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. శుక్రవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

# జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ సమన్వయకర్త విజయసాయిరెడ్డి
- కోవూరు నియోజకవర్గ నేతలతో ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, చిత్రంలో ప్రసన్నకుమార్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి

**కోవూరు:** రాష్ట్రంలోనే నెల్లూరు జిల్లా ప్రత్యేక స్థానాన్ని సంతరించుకునేలా రానున్న రోజుల్లో వేగంగా అభివృద్ధి చేయనున్నామని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రుక్మిణీ కల్యాణ మండపంలో కోవూరు నియోజకవర్గ నేతలతో ఆత్మీయ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. దగదర్తి సమీపంలోని స్థలంలో విమానాశ్రయాన్ని పూర్తిస్థాయిలో త్వరలో ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. నెల్లూరు అభివృద్ధికి దోహదపడేలా ఔటర్ రింగ్ రోడ్డును ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. బడుగు, బలహీన వర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని లబ్ధి చేకూర్చారని చెప్పారు. నార్తురాజుపాళెంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తనకు స్వాగతం పలికిన సందర్భాన్ని ఎన్నటికీ మర్చిపోలేనని తెలిపారు. తాను పుట్టిన గడ్డపై పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయాలని సీఎం సూచించారని, దీంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు. పుట్టిన గడ్డకు సేవ చేసుకునే భాగ్యం తనకు దక్కడాన్ని అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రసన్న ఆలోచనలకు తగిన విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి 50 వేల మెజార్టీ వచ్చేలా నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

**విజయసాయిరెడ్డి విజయం ఖాయం**

రానున్న ఎన్నికల్లో ఎంపీగా విజయసాయిరెడ్డి విజయం సాధిస్తారని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం వద్ద వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఎంతో స్వాతంత్ర్యం ఉండేదని, ఇక నుంచి చంద్రబాబు వద్ద అది లభించదని చెప్పారు. వాడుకొని వదిలేయడం చంద్రబాబు నైజమని విమర్శించారు. విజయసాయిరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించాక ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని చెప్పారు. నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్తగా ముస్లిం అభ్యర్థిని ప్రకటించారనే కారణంతో వేమిరెడ్డి పార్టీని విడిచి వెళ్లిపోయారని, రానున్న ఎన్నికల్లో ఆయనకు తమ సత్తా చూపాలని వారిని కోరారు.

**నా చిరకాల మిత్రుడు**

తన చిరకాల మిత్రుడు విజయసాయిరెడ్డి అని, ఆయన్ను పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంపిక చేశాక జిల్లాలో అనూహ్య స్పందన వచ్చిందని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. విషయ పరిజ్ఞానం ఉన్న వ్యక్తి అని కొనియాడారు. నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, కవరగిరి ప్రసాద్, డీసీఎబీ చైర్మన్ నిరంజన్‌బాబు రెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు, ఏపీఎల్డీఏ చైర్మన్ విజయ్‌కుమార్, వవ్వేరు బ్యాంక్ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ శ్రీనివాసులురెడ్డి ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాలో కోవూరుకు ప్రత్యేక స్థానం

జిల్లాలో కోవూరుకు ప్రత్యేక స్థానం ఉందని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ప్రసన్న కుమార్‌రెడ్డి ఒకే నియోజకవర్గంలో 1983 నుంచి రాజకీయాలను సాగిస్తున్నారని తెలిపారు. నెల్లూరు బ్యారేజీకి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి బ్యారేజీగా సీఎం నామకరణం చేశారని చెప్పారు. తాము సూచించిన వారికి ఎమ్మెల్యే సీట్లు ఇవ్వలేదనే కారణంతో కొందరు పార్టీని వీడారని, ఇది తగదన్నారు. ఇలాంటి వారిని ప్రజలు క్షమించబోరని చెప్పారు.

## ఆశీర్వదించండి.. ఆకాంక్షలను నెరవేరుస్తా



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, పక్కన బీద, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి

**కావలి:** జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే కార్యాన్ని త్రికరణశుద్ధితో నిర్వహించాలనే ఉద్దేశంతో నెల్లూరు ఎంపీగా పోటీ చేయనున్న తనను ప్రజలు ఆశీర్వదించాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త వేణుంబాక విజయసాయిరెడ్డి కోరారు. పార్టీ కావలి నియోజకవర్గ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ఆరెస్సార్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. జిల్లాకు చెందిన బీసీ నేత బీద మస్తాన్‌రావును రాజ్యసభకు ఎంపిక చేసిన సీఎం ఆలోచన విధానాన్ని గమనించాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఈ నెల పదిన నిర్వహించనున్న సిద్ధం సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రతాప్‌కుమార్ రెడ్డిని ఇప్పటికి రెండుసార్లు గెలిపించారని, రానున్న ఎన్నికల్లోనూ ఆయన్ను ఆదరించాలని కోరారు.

**కావలికి వరాలు**

పట్టణం నుంచి సముద్ర తీర ప్రాంత గ్రామాలకు రాకపోకలు సాగించే తుమ్మలపెంట రోడ్డు పనులను ప్రారంభించేందుకు వీలుగా రూ.10 కోట్లను విడుదల చేయించి, సత్వరమే ప్రారంభించనున్నామని ప్రకటించారు. పట్టణంలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించి కేంద్ర రహదారుల శాఖ మంత్రి, కార్యదర్శులతో మాట్లాడతానని చెప్పారు. బిట్రగుంటలో నిరుపయోగంగా ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూమిలో రైల్వే ప్రాజెక్టును మంజూరు చేయించి, పూర్వవైభవం సాధించేలా కృషి చేస్తామని ప్రకటించారు. కావలిలోని రైల్వేస్టేషన్‌ను ఆధునీకీకరించి, అవసరమైన రైళ్లకు స్టాపింగ్ కల్పించేలా చర్యలు చేపడతామని వెల్లడించారు.

**జిల్లా అభివృద్ధికి ఆస్కారం**

సీఎంకు సన్నిహితుడైన విజయసాయిరెడ్డికి కేంద్రంలో మంచి పట్టు ఉందని, ఆయన్ను నెల్లూరు ఎంపీగా గెలిపించుకుంటే జిల్లాలో అభివృద్ధి పనులను మరింత చేసేందుకు అవకాశం ఏర్పడుతుందని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మోసం చేశారని.. విజయసాయిరెడ్డిని పార్టీ పార్లమెంట్ సమన్వయకర్తగా ఎంపిక చేయడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మూడోసారి గెలిపించాలని కోరారు. పార్టీ కందుకూరు నియోజకవర్గ పరిశీలకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### మర్యాదపూర్వకంగా..



**నెల్లూరు(దర్గామిట్ట):** మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడ్ని నెల్లూరులోని ఆయన నివాసంలో కలెక్టర్ హరినారాయణన్ మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

### మంత్రిని కలిసిన జేసీ



**నెల్లూరు(దర్గామిట్ట):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో జేసీ సేతు మాధవన్ మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి మొక్కను అందజేశారు.

### సర్వీస్ రిజిస్టర్లతో రేపు హాజరుకండి

**నెల్లూరు (టౌన్):** జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్స్ స్పెషల్ ఎడ్యుకేషన్ పదోన్నతుల నిమిత్తం అర్హులు సర్వీస్ రిజిస్టర్లతో జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి శనివారం హాజరుకావాలని డీఈఓ రామారావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. అర్హులైన సెకండరీ గ్రేడ్ టీచర్లు తమ విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు నకలు కాపీలు, సర్వీస్ రిజిస్టర్లు, వారి అభ్యర్థనలను సంబంధిత ఎంఈఓల ద్వారా తీసుకురావాలని సూచించారు.

### మసీదుల వద్ద పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న లవన్న

**నెల్లూరు(దర్గామిట్ట):** పవిత్ర రంజాన్ని మాసాన్ని పురస్కరించుకొని మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో లవన్న పేర్కొన్నారు. రంజాన్ మాసంలో మసీదుల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు, సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్లోని డీఆర్వో చాంబర్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా లవన్న మాట్లాడారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. కసుమూరు, ఏఎస్‌పేట దర్గాలు, అన్ని ప్రధాన మసీదుల వద్ద మౌలిక సదుపాయాలను ముందుగానే కల్పించాలని సూచించారు. జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నిర్మలాదేవి, పంచాయతీ అధికారి సుస్మిత, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, విద్యుత్ శాఖ ఈఈ సోమశేఖర్‌రెడ్డి, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, ఎస్‌ఈ సంపత్‌కుమార్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖుదావన్ పాల్గొన్నారు.

### జిల్లాకు రెండు ప్లటూన్ల కేంద్ర బలగాలు

**నెల్లూరు(క్రైమ్):** రెండు ప్లటూన్ల బీఎస్ఎఫ్ బృందాలు జిల్లాకు చేరుకున్నాయి. నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాలకు 120 మంది ఇప్పటికే రాగా, కావలి నియోజకవర్గానికి 66 మంది సిబ్బంది గురువారం వచ్చారు. నగర, రూరల్ నియోజకవర్గాల బీఎస్ఎఫ్ సిబ్బందికి వెంకటేశ్వరపురం పాలిటెక్నిక్ కళాశాలలో.. కావలి నియోజకవర్గ సిబ్బందికి మద్దూరుపాడులోని కళాశాలలో బస కల్పించారు. ఈ నెల పదిన రానున్న మరో ప్లటూన్ సిబ్బందిని ఆత్మకూరు నియోజకవర్గానికి కేటాయించనున్నారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసేంత వరకు జిల్లాలో వీరు విధులు నిర్వర్తించనున్నారు.

### భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదు

**నెల్లూరు(బృందావనం):** నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను అధికార యంత్రాంగం సమన్వయంతో నిర్వహించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నెల్లూరు ఆర్డీఓ మలోల పేర్కొన్నారు. రంగడి బ్రహ్మోత్సవాలను ఈ నెల 20 నుంచి 31 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని దేవస్థాన ప్రాంగణంలోని సాంస్కృతిక మందిరంలో ఆర్డీఓ గురువారం నిర్వహించారు. ఆహ్వాన పత్రికలు, పోస్టర్లను ఆవిష్కరించారు. కార్పొరేటర్ గుంజి జయలక్ష్మి, నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సభ్యులు సాదా గోపీ, వేలూరు శ్రీనివాసులు, మాధవి, పద్మజ పాల్గొన్నారు.

## హామీల అమలు జగన్‌తోనే సాధ్యం



నమూనా చెక్కును ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- వైఎస్సార్ చేయూత నగదు జమ

**నెల్లూరు(దర్గామిట్ట):** వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో మొత్తం రూ.75 వేలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారని, హామీల అమలు ఆయనతోనే సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమాన్ని అనకాపల్లిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నిర్వహించారు. బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదును జమ చేశారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఆనం అరుణమ్మ ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, కలెక్టర్ హరినారాయణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా జిల్లాలోని 1,26,710 మంది మహిళలకు రూ.237.58 కోట్ల మేర జమ చేశారని చెప్పారు. ఈ ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలుత వైఎస్సార్ చేయూత మెగా చెక్కును ఆవిష్కరించారు. డీఆర్డీఏ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు సాంబశివారెడ్డి, రవీంద్ర, మైనార్టీ సంక్షేమాధికారి నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

## రూ.7.5 లక్షల నగదు, బంగారం స్వాధీనం

**కావలి:** స్థానిక రైల్వేస్టేషన్లో వ్యక్తి నుంచి రూ.7.5 లక్షల నగదు, 88.91 గ్రాముల బంగారాన్ని కావలి రైల్వే పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. కావలి రైల్వే ఎస్సై అరుణకుమారి వివరాల మేరకు.. పట్టణానికి చెందిన పొన్నూరు కృష్ణ స్థానిక రైల్వేస్టేషన్లో రెండో నంబర్ ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా ఉండటంతో అతని బ్యాగులను తనిఖీ చేశారు. నగదు, బంగారానికి ఎలాంటి రసీదు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించారు.

## రైల్వేస్టేషన్లో అభివృద్ధిపై సమావేశం నేడు

**నెల్లూరు(సెంట్రల్):** నెల్లూరులోని ప్రధాన రైల్వేస్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

## నియామక పత్రాల అందజేత

**నెల్లూరు(సెంట్రల్):** జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసేందుకు 136 మంది గ్రామ పశు సంవర్ధక సహాయకులకు నియామక పత్రాలను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మహేశ్వరుడు గురువారం అందజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడారు. వీరికి మొదటి నాలుగు నెలల పాటు శిక్షణను ఇవ్వనున్నామని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో పశుసంవర్ధక శాఖకు సంబంధించి మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు.

## ఆలోచనా ధోరణిలో మార్పు రావాలి



సత్కారం అందుకున్న మహిళా ప్రముఖులతో వెంకయ్యనాయుడు

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 'మహిళలకు వందనం'

**వెంకటాచలం:** మహిళా సాధికారిత దిశగా సమాజ ఆలోచనా ధోరణిలో మార్పులు రావాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మహిళలకు వందనం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు రాజారత్నం అనూరాధ (విశ్రాంత డీజీ), విజయ ఖదీర్ (ప్రొఫెసర్), నివేదిత, లత (ఇస్రో), శిరీష, ఉషా వర్మ (డీఆర్డీఓ), పార్వతి (భరతనాట్యం), కుముద (అక్షర విద్యాలయ ప్రిన్సిపల్) తదితరులను సత్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. మహిళలను గౌరవించడం భారతీయ సంస్కృతి, సంప్రదాయమని.. దీన్ని ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని కోరారు. మహిళలు తమకు ఇష్టమైన రంగాల్లో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనేక దేశాల్లో మహిళా సాధికారత విషయంలో గణనీయమైన పురోగతి ఉన్నా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇంకా సాధించాల్సిన సవాళ్లు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ జీడీపీ సగటులో మహిళల వాటా 37 శాతం కాగా, మహిళలను గౌరవించే భారత్ లాంటి దేశాల్లో 18 శాతంలోపే ఉండటం విచారకరమన్నారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. రాజకీయ రంగంలో మహిళలకు ఎక్కువ అవకాశాలు కల్పించి.. అసెంబ్లీ, పార్లమెంట్‌లోకి వెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యతో మహిళల్లో చైతన్యం పెరుగుతుందని చెప్పారు.

**ఉచిత వైద్యశిబిరం**

స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో నారాయణ మెడికల్ కళాశాల, బసవతారకం కేన్సర్ హాస్పిటల్ (హైదరాబాద్) సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ప్రముఖ వైద్యులను స్వర్ణభారత్ ట్రస్ట్‌కు తరచూ పిలిపించి, జిల్లా ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడాన్ని అభినందించారు. స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, ట్రస్టీ హరికుమార్‌రెడ్డి, రత్నం విద్యాసంస్థల అధినేత డాక్టర్ కిశోర్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

## రెప్పపాటులో ముగిసిన నూరేళ్ల జీవితం

- రోడ్డు ప్రమాదంలో నవ దంపతుల దుర్మరణం
- భార్యను పరీక్షకు తీసుకెళ్తుండగా ఘటన
- రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం



దంపతుల మృతదేహాలు (ఇన్‌సెట్‌లో) ప్రశాంత్, పుష్ప (ఫైల్)

**వెంకటాచలం:** వారిద్దరికీ వివాహం జరిగి నెల రోజులవుతోంది. ఎన్నో ఆశలతో కొత్త జీవితంలోకి అడుగుపెట్టారు. ఇంతలో రోడ్డు ప్రమాదం మృత్యువు రూపంలో కబళించింది. మండలంలోని చెముడుగుంట వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన ఈ ఘటన రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. వెంకటాచలం పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని రామకోటయ్య నగర్ ప్రాంతానికి చెందిన మన్నెంబాబు కుమార్తె పుష్ప (24) చెముడుగుంట సమీపంలోని రావూస్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంబీఏ చదువుతోంది. నవాబుపేట సమీపానికి చెందిన ప్రశాంత్‌తో గత నెల 8న ఆమెకు వివాహమైంది. ప్రశాంత్ గతంలో చెన్నైలో ప్రైవేట్ జాబ్ చేశారు. పెళ్లి తర్వాత ఇంటి వద్దే ఉంటున్నారు. కాకుటూరు వద్ద కృష్ణచైతన్య కళాశాలలో పుష్ప గురువారం మధ్యాహ్నం పరీక్ష రాయాల్సి ఉంది. దీంతో ప్రశాంత్ దంపతులు బైక్‌పై బయల్దేరారు. చెముడుగుంట సమీపంలో వారి బైక్‌ను వెనుక నుంచి వేగంగా ఆటో ఢీకొంది. దీంతో భార్యాభర్తలు జాతీయ రహదారిపై పడిపోయారు. అదే సమయంలో వెళ్తున్న ఆర్టీసీ బస్సు వారిపై దూసుకెళ్లింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**కన్నీరుమున్నీరైన బంధువులు**

రోడ్డు ప్రమాదంలో నవ దంపతులు చనిపోయారని తెలియడంతో మృతుల బంధువులు ఘటన స్థలానికి చేరుకున్నారు. గంట క్రితం ఆనందంగా వెళ్లిన వారు విగతజీవులుగా మారిపోయారంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు.

## రేపట్నుంచి ఇంటర్ మూల్యాంకనం

**నెల్లూరు (టౌన్):** ఇంటర్ పరీక్షలకు సంబంధించిన సంస్కృత పేపర్ల మూల్యాంకనాన్ని శనివారం ప్రారంభించనున్నామని ఆర్ఐఓ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ వారి కళాశాలల్లోని సంస్కృత అధ్యాపకులను రిలీవ్ చేయాలని సూచించారు. స్టోన్‌హౌస్‌పేటలోని కేఏసీ జూనియర్ కళాశాల స్పాట్ వాల్యుయేషన్ క్యాంపులో మధ్యాహ్నం మూడు గంటలకు రిపోర్ట్ చేయాలని కోరారు.

## శంభో.. శివశంభో

- సింహపురిలో మహాశివరాత్రి శోభ


మహాశివరాత్రి పర్వదినాన్ని శుక్రవారం పురస్కరించుకొని నగరంలోని ఆదిదంపతుల కొలువులు ముస్తాబయ్యాయి. పార్వతీ, పరమేశ్వరులకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లింగోద్భవాభిషేకాలు తదితరాలను నిర్వహించనున్నారు. మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయం తదితర ఆలయాలను విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. – నెల్లూరు(బృందావనం)



భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ఏర్పాటు చేసిన పందిళ్లు



విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా మూలస్థానేశ్వరాలయం



## క్లుప్తంగా

### మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు

• ఏఎస్పీ సౌజన్య




మాట్లాడుతున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(వేదాయపాళెం): 'మహిళలు అన్ని రంగాల్లో రాణించడం శుభపరిణామం. వారి రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం' అని ఏఎస్పీ సౌజన్య తెలిపారు. నెల్లూరు గాంధీ నగర్‌లోని మహిళా ప్రాంగణంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. దీనికి ఏఎస్పీ హాజరై మాట్లాడారు. మహిళలు సమాజంలోని వివక్షను ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సివిల్ జడ్జి వాణి మాట్లాడుతూ ఏటా మహిళలు సాధించిన విజయాల గురించే మాట్లాడటమే కాకుండా లింగ వివక్షను రూపు మాపేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ మాట్లాడుతూ బాలికలు చదుకోవాలన్నారు. మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మాధవి, సర్వశిక్ష పీఓ ఉషారాణి, ప్రాంగణం మేనేజర్ మాధవి, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి వెంకటయ్య, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, నెల్లూరు అర్బన్ సీడీపీఓ అన్నపూర్ణ, అనురాధ, లక్ష్మీదేవి, అరుణ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### అనారోగ్యం తాళలేక..

• ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైమ్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలు గురువారం మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. రామకోటయ్యనగర్ సమీపంలోని వసుధానగర్‌లో పరంధామయ్య, ఉమాపద్మావతి దంపతులు నివాసం ఉంటున్నారు. పరంధామయ్య తల్లి భాగ్యలక్ష్మి బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టింది. ఏడాదిగా ఆమె అందుకు సంబంధించిన మందులు వాడుతోంది. కొద్దిరోజులుగా కడుపులో తీవ్ర నొప్పిగా ఉందని, బాధ భరించడం కన్నా చనిపోవడం మంచిదని కొడుకు, కోడలితో అంటూ ఉండేది. వారు ఆరోగ్యం బాగవుతుందని చెబుతూ వచ్చారు. ఈనెల ఐదో తేదీ సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భాగ్యలక్ష్మి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కోడలు విషయాన్ని తన భర్తకు తెలియజేసింది. ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఆరో తేదీన జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ భాగ్యలక్ష్మి మృతి చెందింది. పరంధామయ్య వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# రోజురోజుకు దిగజారుతున్న చంద్రబాబు

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి

మనుబోలు: 'అధికారంలోకి రావడానికి చంద్రబాబు నాయుడు రోజురోజుకు దిగజారిపోతున్నారు. ఓట్ల కోసం ప్రజలకు మాయమాటలు చెబుతున్నారు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముద్దుమూడి గ్రామంలో రూ.2.80 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారంలో ఉండగా బీసీలను పట్టించుకోని బాబు ఇప్పుడు డిక్లరేషన్ పేరుతో దగాకోరు మాటలు చెబుతున్నాడన్నారు. ప్రజలకు మంచి జరిగితే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తట్టుకోలేడన్నారు. సబ్‌స్టేషన్ నిర్మిస్తున్న స్థలం పంచాయతీదనే కారణం చూపి నిర్మాణాన్ని అడ్డుకునే యత్నం చేశాడన్నారు. అధిష్టానం టికెట్ లేదని చెబుతున్నా తనను తిట్టేందుకే గ్రామాల్లో తిరుగుతున్నాడని చెప్పారు. ప్రజల అవసరాలను గుర్తించి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమానికే పరిమితం కాకుండా అభివృద్ధికి కూడా తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చిందన్నారు. అందుకే మీకు మంచి జరిగిందని భావిస్తేనే నాకు ఓటు వేయండని సీఎం ధైర్యంగా అడుగుతున్నట్లు చెప్పారు. సర్వేపల్లి ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, కొమ్మలపూడి, చెరుకుమూడి సర్పంచ్‌లు బందెల వేణుగోపాల్, కూరపాటి సుబ్బరత్నమ్మ, ఏఎంసీ ఉపాధ్యక్షుడు చెందులూరు శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యురాలు శిరీష తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి కాకాణి

# మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

• నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని నెల్లూరు ఎంపీ, ఆ పార్టీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 26వ డివిజన్ జ్యోతి నగర్ ఆరో వీధిలో మహిళా దీవెన అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. వారి పేరు మీదే ఇళ్ల పట్టాలు అందజేసినట్లు తెలిపారు. పథకాలతో అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రతి మహిళ అండగా నిలవాలని కోరారు.

**నా భర్త ప్రాణాలు కాపాడారు**

స్థానిక మహిళ కారంపూడి రాధ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ తన భర్త ప్రాణాలు నిలబెట్టినట్లు తెలిపారు. ఆయనకు గుండెపోటు వచ్చిందన్నారు. ఆ సమయంలో తమ వద్ద తగినంత నగదు లేదని, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స చేయించినట్లు వెల్లడించారు. ఎన్నో మంచి పనులు చేసిన సీఎం వైఎస్ జగన్ వైపే మహిళలు ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి, మేయర్ స్రవంతి, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్ ఏసునాయుడు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఎం.గౌరి, డివిజన్ ఇన్‌చార్జిలు మల్లెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, పుల్లూరు చంద్రమౌళి, షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

# సీఎం జగనన్న వెంటే జనం

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: అధికారం వచ్చిన మొదటి రోజు నుంచే సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు అందించిన జగనన్న వెంట నడిచేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన సంగంలో గురువారం రూ.1.35 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డుకు ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టోలోని హామీలను 99 శాతం మేర నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందున్నారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీని పర్యాటకంగా అభివృద్ధిని చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు విన్నవించినట్లు ఎమ్మెల్యే మేకపాటి తెలిపారు. సంగం వద్దనున్న కొండలను పర్యాటకంగా, హరితవనంగా అభివృద్ధి చేసేలా, ఇక్కడ టూరిజం పార్కు ఏర్పాటుకు ప్రయత్నిస్తామని, ఇందుకోసం రూ.కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, ఎంపీపీ పద్మావతమ్మ, జెడ్పీటీసీ రావుల లక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దేవసహాయం, తుంగా ఇందూధర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, గుండాల బాలచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభించిన విక్రమ్‌రెడ్డి

### నిమ్మ ధరలు (కిలో)

| | |
|---|---|
| పెద్దవి | : రూ.80 |
| సన్నవి | : రూ.65 |
| పండ్లు | : రూ.27 |



# బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలి

• కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను పూర్తిస్థాయిలో నియమించుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో గురువారం ఆయా పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 19,20,682 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని చెప్పారు. 8 నియోజకవర్గాల పరిధిలోని 2,317 పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. 211 ఫారం-6, 596 ఫారం-7, 172 ఫారం-8 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కావలి నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పు, కందుకూరు నియోజకవర్గంలో ఒక లొకేషన్ మార్పునకు సంబంధించిన వివరాలను పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో లవన్న, వైఎస్సార్‌సీపీ నుంచి సి.నారాయణ, టీడీపీ నుంచి రసూల్, బీజేపీకి చెందిన శ్రీనివాస్, బీఎస్పీ నుంచి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) : 120 | బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 240 |
| లేయర్ (లైవ్) : 70 | లేయర్ చికెన్ : 120 |
| బ్రాయిలర్ చికెన్ : 214 | |





# ఉద్యోగాలు కల్పించింది మా ప్రభుత్వమే..

• వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సచివాలయాలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పించింది. ఇది కనిపించడం లేదా చంద్రబాబూ' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రశ్నించారు. నగరంలోని 3వ డివిజన్ సింహపురి కాలనీ, గాండ్ల నగర్, అలాగే 16వ డివిజన్ గుర్రాలమడుగు సంఘం, తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ సిటీ సమన్వయకర్త ఎండీ ఖలీల్ అహ్మద్, పర్వతరెడ్డి కలిసి గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాలన ప్రజల ముంగిటకే వచ్చిందన్నారు. చంద్రబాబు తన పాలనలో ఉద్యోగాలు ఇవ్వలేక పోయారన్నారు. టీడీపీ నుంచి ధనవంతుడు పోటీ చేస్తుంటే.. జగన్‌మోహన్‌రెడ్డి సామాన్యుడికి అవకాశం ఇచ్చారన్నారు. జిల్లా అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పేరుతో అప్పులు చేసి ఇష్టానుసారంగా రోడ్లు తవ్వారన్నారు. సిటీ ఎమ్మెల్యేగా అనిల్ కుమార్ ఎన్నో పనులు చేశారన్నారు. కాలువగట్లపై నివాసం ఉంటున్న దాదాపు 3,000 కుటుంబాలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంక్రాంతి అశ్విని, వేనాటి శ్రీకాంత్ రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఎండీ ఖలీల్ అహ్మద్, చంద్రశేఖర్‌రెడ్డి

# వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరు

• ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

వరికుంటపాడు: ఎంతమంది ఏకమై వచ్చినా.. ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని గొల్లపల్లె, ఎస్టీ కాలనీ, కురపవానిపల్లె, పాపన్నగారిపల్లె, మహమ్మదాపురం గ్రామాల్లో ఆయన గురువారం విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల సిఫార్సు ఉన్న వారికే పథకాలు ఇచ్చేవారన్నారు. కానీ వైఎసార్‌సీపీ హయాంలో ఎవరి ప్రమేయం లేకుండా వలంటీర్ల ద్వారా అర్హతే ప్రామాణికంగా సంక్షేమం అందుతోందన్నారు. సిద్ధం సభలకు వచ్చే జనసందోహాన్ని చూసి టీడీపీకి భయం పట్టుకుందన్నారు. మేదరమెట్లలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తెచ్చుకుంటేనే ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసేవ చేసే వారిని గుర్తించి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు జి.రామాంజనేయులు, జేసీఎస్ కన్వీనర్ బి.వెంకటేశ్వర్లు, మండల కో-ఆప్షన్ సభ్యుడు జిలానీబాషా, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీ అహ్మద్, నాయకులు తిరుపతినాయుడు, దాసరి ఎర్రా ఓబయ్య, నరసారెడ్డి, అవులయ్య, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి



# వ్యక్తి అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తి తన ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన నెల్లూరు వైఎస్సార్ నగర్‌లో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నానికి చెందిన రవికుమార్ (55), కుమారికి గతంలో వివాహమైంది. వారికి సంతానం లేదు. దీంతో అతను కుమారి సోదరి శాంతకుమారిని పెళ్లి చేసుకున్నాడు. వారికి ముగ్గురు కుమారులున్నారు. రవికుమార్ కొన్నేళ్ల క్రితం నెల్లూరుకు వచ్చేశాడు. ఓ లాయర్ వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలోనే ఓ మహిళతో అతడికి పరిచయమైంది. ఇద్దరూ సహజీవనం చేస్తూ ప్రస్తుతం వైఎస్సార్ నగర్‌లో ఉంటున్నారు. రెండు నెలలకు ఒకసారి రవికుమార్ విజయవాడలోని కుటుంబసభ్యుల వద్దకు వెళ్లి వచ్చేవాడు. రెండునెలలుగా తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నాడు. సహజీవనం చేస్తున్న మహిళపై అతను అనుమానం పెంచుకున్నాడు. దీంతో వారి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. గురువారం తెల్లవారుజామున ఘర్షణ పడ్డారు. దీంతో ఆ మహిళ అతను ఇంట్లో ఉండగా బయటకు వచ్చి తలుపు గడియపెట్టి జరిగిన విషయాన్ని స్థానికంగా ఉన్న వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి తెలియజేసింది. వారిద్దరూ ఇంట్లోకి వెళ్లిచూడగా రవికుమార్ మంచంపై పడి ఉన్నాడు. దీంతో వారు 108కు ఫోన్ చేయగా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని రవికుమార్‌ను పరీక్షించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో వెంకటేశ్వర్లు జరిగిన విషయాన్ని మృతుడి కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా విషయాన్ని తెలియజేశారు. కుమారి, మృతుడి సోదరుడు రమేష్‌బాబు రాత్రి నెల్లూరుకు చేరుకుని వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేశారు.

# కమిటీ ఓకే చేశాకే ప్రసారం

• నోడల్ ఆఫీసర్ బాపిరెడ్డి

నెల్లూరు(పొగతోట): పొలిటికల్ ప్రకటనలను మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఓకే చేసిన తర్వాతే ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేయాలని ఎన్నికల ట్రెనింగ్ నోడల్ ఆఫీసర్ బాపిరెడ్డి తెలిపారు. నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా ప్రతినిధులు, ప్రకటనల విభాగాల మేనేజర్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో మీడియా ప్రజలకు సరైన సమాచారాన్ని అందించాలన్నారు. ఓటర్లను చైతన్యపరిచే విషయంలో కీలకపాత్ర పోషించాలని తెలిపారు. అధికారిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమాచార శాఖ ద్వారా తెలియజేస్తామన్నారు. పెయిడ్ న్యూస్ ప్రసారమైతే అభ్యర్థి ఖర్చుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవి, హింసను ప్రేరేపించే వార్తలను ప్రసారం చేయొద్దని తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌డీఆర్డీ డిప్యూటీ డైరెక్టర్ కె.సదారావు, జెడ్పీ సీఈఓ కన్నము నాయుడు, డిప్యూటీ సీఈఓ చిరంజీవి, ఎన్‌ఐసీడీఐఓ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

### గాయపడిన వ్యక్తి మృత్యువాత

ఆత్మకూరు: పెట్రోల్ పోసి నిప్పు అంటించిన ఘటనలో గాయపడిన వ్యక్తి మృతిచెందాడు. సీఐ జి.వేణు కథనం మేరకు.. మండలంలోని అప్పారావుపాళెం గ్రామం దళిత కాలనీకి చెందిన వజ్రమ్మ అనే మహిళ మస్తాన్‌రెడ్డి (35)ని బుధవారం ఇంటికి పిలిచింది. అతను స్నానానికి వెళ్లిన సమయంలో పెట్రోల్ పోసి నిప్పు అంటించిన విషయం తెలిసిందే. దీంతో తీవ్రంగా గాయపడిన మస్తాన్‌రెడ్డిని మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. అతను బుధవారం అర్ధరాత్రి మృతిచెందినట్లు సీఐ వివరించారు. గురువారం మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు.